పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పరవాడ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని జేఎన్‌పీసీ సంఘ ప్రతినిధి జెట్టి సుబ్బారావు అన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి డీసీఏ బృందం జేఎన్‌పీసీలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర డ్రైవ్ అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా జేఎన్‌పీసీ భాగస్వామ్యంతో రాంకీ ఫార్మాసిటీ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, తయారీదారుల సంఘం సంయుక్తంగా పాల్గొని ఫార్మాసిటి ఎంట్రీ పాయింట్ వద్ద గుంతలు పూడ్చడం, పరిసరాల పరిశుభ్రత తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు అభిప్రియ, కూన కల్యాణి, ఎస్.కల్యాణి, ఇందిర, భారతి తదితరులు పాల్గొన్నారు.



తాత్కాలిక వైకల్యం పేరిట నోటీసు ఇచ్చారు

ప్రమాదవశాత్తు కాలు దెబ్బతినడంతో అంగవైకల్యానికి గురయ్యాడు మండలంలోని రాయపుర అగ్రహారానికి చెందిన పల్ల కన్నయ్య. దీంతో డాక్టర్లు వైకల్యాన్ని గుర్తించి ధ్రువీకరించడంతో 2011 నుండి 14 సంవత్సరాలుగా సామాజిక పింఛన్ అందుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.4 వేలు ఉన్న దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సుమారు 13 నెలలుగా పెంచిన పింఛన్ అందుకుంటున్నాడు కన్నయ్య. ఇంతలోనే అతనికి పింఛన్ తొలగిస్తున్నట్టు అధికారులు నోటీసు జారీ చేశారు. దీంతో వైకల్యం.. ఆపై వృద్ధాప్యంతో బాధపడుతున్న తనకు ప్రభుత్వం నుండి లభించే ఆసరా లేకపోతే తన పరిస్థితి ఏమిటని అతను వాపోతున్నాడు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. తనకు 44 శాతానికి పైగా వైకల్యం ఉన్నట్టు డాక్టర్లు ధ్రువీకరించడంతో అప్పటి నుండి పింఛన్ తీసుకుంటున్నాడు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన పరిశీలనలో తాత్కాలిక వైకల్యంగా నోటీసు అందించారు. తన ధ్రువీకరణ పత్రాలు అధికారులకు అందజేశాడు. వాటిని ఉన్నతాధికారులకు పంపిస్తామని, మరోసారి వైద్యులు పరిశీలించి అర్హత ఉంటే పింఛన్ పునరుద్ధరిస్తామని చెబుతున్నారని, లేకపోతే తొలగిస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు కన్నయ్య.



కూటమి ప్రభుత్వ హయాంలో రాయపుర అగ్రహారంలో ఒకే చోటుకు అందరినీ చేర్చి పింఛన్లు పంపిణీ చేస్తున్న పంచాయతీ సెక్రటరీ (ఫైల్)

దైన్యంలో.. దివ్యాంగులు

- పింఛన్ల తొలగింపు దిశగా కూటమి ప్రభుత్వ ప్రయత్నాలు
- మండలంలో పెద్ద ఎత్తున నష్టపోనున్న లబ్ధిదారులు

సబ్బవరం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పెద్ద ఎత్తున పింఛన్ల తొలగింపునకు రంగం సిద్ధమయింది. పర్సెంటీజీల మెలికతో ఇప్పటికే సచివాలయాల వారీగా లబ్ధిదారులకు నోటీసులు అందజేస్తున్నారు. నోటీసులు అందుకున్న వారు మండల పరిషత్ కార్యాలయంతో పాటు తమ పరిధిలోని గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పలు కారణాలతో నోటీసులు..

దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులకు రీ వెరిఫికేషన్ పేరుతో డాక్టర్లు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి వెబ్‌సైట్‌కు అనుసంధానం చేసిన విషయం తెలిసిందే. ఈ పరిశీలనలో 40 శాతం పైన ఉన్నవారికి సైతం పలు కారణాలతో నోటీసులు అందజేశారు. 85 శాతానికి పైగా వైకల్యం కలిగి మంచానికే పరిమితమైన వారికి యథావిధిగా రూ.15 వేలు పింఛన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 85 శాతం కంటే తక్కువ 40 శాతం కంటే ఎక్కువ ఉన్న వారికి రూ.6 వేల పింఛన్ కొనసాగించనున్నట్లు తెలిపారు. 40 శాతం కంటే తక్కువ వైకల్యం కలిగి, 60 సంవత్సరాలు పైబడి వయసు ఉంటే వారి పింఛన్‌ను వృద్ధాప్య పింఛన్‌గా మార్చి అందజేయనున్నట్లు తెలిపారు. 40 శాతం కంటే తక్కువ వైకల్యం కలిగి 60 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారికి వచ్చే నెల నుండి పింఛన్లు నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు. పింఛన్లు తొలగించనున్నట్లు నోటీసులు అందుకున్నవారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో అప్పీల్ చేసుకుంటే ఉన్నతాధికారులకు పంపిస్తామని, సంబంధిత అధికారులు మరోసారి పరిశీలించేందుకు అవకాశం కల్పించి డాక్టర్‌లు 40 శాతం కంటే అధికంగా వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరిస్తేనే పింఛన్ వస్తుందని అధికారులు చెబుతున్నారు.

పర్సెంటీజీల మెలికతో ముప్పు..

మండలంలో 24 గ్రామ పంచాయతీల పరిధిలో 20 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. 8,143 పింఛన్లు ఉన్నాయి. వీటిలో 4,140 వరకూ వృద్ధాప్య పింఛన్లు, 2,208 వితంతు పింఛన్లు, 1,182 వికలాంగ పింఛన్లు కాగా మిగిలినవి ఇతర పింఛన్లు ఉన్నాయి. వీటిలో 232 దివ్యాంగ పింఛన్లు తొలిగించేందుకు అధికారులు నోటీసులు అందజేయడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. కూటమి సానుభూతిపరుల పింఛన్లు కొనసాగిస్తూ మిగిలిన వారికి పర్సెంటీజీల మెలికతో తొలగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారుల పరిశీలనకు పంపిస్తాం..



పింఛన్ వెబ్‌సైట్‌లో అనర్హులుగా అనుసంధానం చేసిన వారికి ఇప్పటికే నోటీసులు అందజేశాం. దీనిపై అప్పీల్ చేసుకునే వారంతా సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సచివాలయాలలో అందజేస్తే పరిశీలనకు ఉన్నతాధికారులకు పంపిస్తాం. ఇప్పటి వరకూ మండలంలో 232 మంది దివ్యాంగులకు నోటీసులు అందజేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్పీల్ చేసుకునే వారికి డాక్టర్లు 40 శాతం కంటే అధికంగా వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరిస్తే పింఛన్లు పునరుద్ధరిస్తాం.

– శివప్రసాద్ సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీవో, సబ్బవరం మండలం

మట్టి విగ్రహాలనే పూజించాలి



ఎస్సీ బాలికల వసతి గృహంలో మట్టి గణపతి విగ్రహాలతో విద్యార్థులు, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధులు



మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలరాజు, విష్ణుమూర్తి



మట్టి వినాయక ప్రతిమలతో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు, యువతులు, చిన్నారులు, నిర్వాహకులు

పెందుర్తి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వినాయక చవితి రోజు మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే పూజించాలని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం తెలిపారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థులు రూపొందించిన మట్టి విగ్రహాలను ఆదివారం ప్రదర్శించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, గ్రీన్ క్లైమేట్ కో ఆర్డినేటర్ సత్యవతి, రాజేశ్వరి, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక సంస్థ, అనకాపల్లి ఫెసిలిటేటర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

➡ స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద స్థానిక నాయకుడు వేగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వందలాది మట్టి విగ్రహాలను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. శరగడం అప్పారావు, ఆళ్ల నాగరాజు, కాండ్రేగుల వెంకట్రావు, పెంటకోట నాయుడు, మళ్ల రవి, విశ్వేశ్వరరావు, తులసీరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

➡ కాలనీ పార్కు సమీపంలోని సంపత్ వినాయక ఆలయంలో మట్టి గణపతి ప్రతిమలను భక్తులకు ఉచితంగా అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వేంపరాల వెంకటేశ్వర్లు, హెచ్ఎస్ రామకృష్ణ, కీర్తి కామేశ్వరరావు, గణేష్‌పాత్రుడు, ఎస్వీఆర్ రమణమూర్తి, సంతోష్, ధనుంజయ్, అర్చకులు రాజుబాబు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ..

సింహాచలం: వినాయక చవితిని పురస్కరించుకుని 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి ఆదివారం మూడు వేల మట్టి గణనాథుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. వార్డు పరిధి సింహపురికాలనీ ముఖద్వారం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. సింహపురికాలనీ, సింహపురి లేఅవుట్, అప్పన్నపాలెం తదితర ప్రాంతాల నుంచి నివాసితులు పెద్ద ఎత్తున తరలివచ్చి మట్టి గణపతి ప్రతిమలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీల అసోసియేషన్ల నాయకులు, నివాసితులు టి.చిరంజీవిరావు, బి.అప్పలనాయుడు, రామలక్ష్మి, వై.కె.చింతారావు, కె.అప్పలనాయుడు, చంద్రమౌళి, వనకుమార్, కృష్ణమోహన్, జగదీష్, ఎన్.దేముడు, సంతోష్ పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల తయారీలో శిక్షణ..

నగరానికి చెందిన తరలి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం 98వ వార్డు పరిధి అడవివరంలోని ఎంఎంటీసీ కాలనీలో మట్టి వినాయక ప్రతిమల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు, ఉద్యోగులు, చిన్నారులు పాల్గొని మట్టి వినాయక ప్రతిమలు తయారు చేశారు. తరలి ఆర్ట్స్ నిర్వాహకులు గౌతమ్, ప్రియ, షణ్ముఖ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. గౌతమ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. త్వరలో డ్రాయింగ్, లైవ్ పెయింటింగ్, వాటర్ కలర్ పెయింటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

యుగంధర్‌కు ఘన నివాళి



యుగంధర్ పార్థివ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని ఇరువాడ శివారు గణపతినగరంలో అనారోగ్యంతో మృతి చెందిన నలమూరి యుగంధర్ పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత వెంకటనాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం ఆటోనగర్‌కి చెందిన జి.వెంకటనాయుడు దంపతులు రూ. 2 లక్షల 8 వేల విరాళం చెక్కుని పీఆర్‌వో కార్యాలయంలో ప్రోటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల సందడి

పరవాడ: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1982–83లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో కలుసుకున్నారు. 42 ఏళ్ల తర్వాత కలిసినందుకు పాతకాలపు ముచ్చట్లు నెమరు వేసుకున్నారు. తమకు విద్య బోధించిన పూర్వ ఉపాధ్యాయులను సత్కరించారు. సహపంక్తి భోజనం చేసి ఆనందించారు.

ఆదిత్యునికి అభిషేకాలు

పెందుర్తి: సుజాతానగర్‌లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున స్వామివారికి పంచద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేసి హారతులు అందించారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

పెందుర్తి పోలీసులకు రివార్డులు



రివార్డులందుకుంటున్న క్రైం విభాగం ఎస్ఐ సూరిబాబు, సిబ్బంది

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పలు చోరీ కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన పెందుర్తి క్రైం విభాగం పోలీసులను నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి సత్కరించి రివార్డులు అందజేశారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు, హెచ్‌సీలు జి.నాగరాజు, వి.పేరయ్యనాయుడు, టి.పద్మజ, పీసీలు టి.శివప్రసాద్, వి.విజయ్‌కుమార్, బి.దేముడునాయుడు, ఆర్.వెంకటేష్, ఎల్.సింహచలంనాయుడు, ఎల్.తాతారావు, యు.చంద్రకళ, ఆర్.సంతోషిలను సీపీ అభినందించారు.

యథావిధిగా రైతుబజార్

పెందుర్తి: వినాయక చవితి సందర్భంగా స్థానిక రైతు బజార్ మంగళ, బుధవారాల్లో యథావిధిగా పని చేస్తుందని ఈవో ఎస్.పద్మావతి షర్మిల తెలిపారు. వాస్తవానికి బుధవారం బజార్‌కు సెలవు అయినా పండగ సామగ్రి కొనుగోళ్లు ఉంటాయి కాబట్టి సెలవును రద్దు చేశామన్నారు. వినియోగదారులు, రైతులు గమనించాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

సబ్బవరం: ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశం కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిసెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రం సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ఆదివారం ఆటో కార్మికుల నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయడం వల్ల రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బ తిందన్నారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర ద్వారా సంవత్సరానికి రూ.25 వేలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి, ఎం. గౌరేష్, కె. కోటి, జి. ప్రసాద్, నాయకులు బంగారినాయుడు, రమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభల విజయవంతానికి పిలుపు

పరవాడ: అక్టోబరు 13, 14, 15 తేదీల్లో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహాసభల పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఐద్వా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మన్యాల బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, దేవి, సాయి, మంగమ్మ, లక్ష్మమ్మ, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

సబ్బవరం: స్థానిక సీతారామ కల్యాణ మండపంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల 6వ మహాసభలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పథకం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ కార్మికులకు రాజకీయ వేధింపులు, తొలగింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ మహాసభలకు 19 మండలాల నుండి సుమారు 120 మంది వరకూ ప్రతినిధులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు, బీబీఎం శ్రీదేవి, గౌరీ, పార్వతి తదితరులు హాజరయ్యారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

పరవాడ: మండలంలో కన్నూరు శివారు మామిడిపాలెం గ్రామానికి చెందిన శీరంశెట్టి నరసింగరావు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. సమస్య తెలుసుకున్న అగనంపూడి గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు అతనికి నెల రోజులకు అవసరమైన నిత్యావసర సరుకులు, కొంత మేర ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ సీహెచ్ తాతాజీ, జి.రమేష్, ఆర్.రాము, ఉదయ్, ఈశ్వరరావు, వర్మ, రామకృష్ణ, సూర్య, ఎం.నూకనాగ, సత్తిబాబు, మామిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వుడా కాలనీలో ఓపెన్ జిమ్ ప్రారంభం

పెందుర్తి: జీవీఎంసీ నిధులతో చినముషిడివాడ వుడా కాలనీలోని పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకుడు శానాపతి శంకర్రావు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.